క్లుప్తంగా

చెత్త బండి రాలేదంటూ...



అమరచింత: తమ కాలనీకి చెత్త బండి రావడం లేదంటూ రాణాప్రతాప్ నగర్, బుడుకలి ఏరియా కాలనీకి చెందిన పలువురు తమ ఇంటి చెత్తను టబ్బుల్లో వేసి సమీపంలోని ప్రైవేట్ స్థలంలో పారవేస్తున్నారు. స్థానిక చండూల్ బీడీ ఫ్యాక్టరీ సమీపంలో ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు నిత్యం చెత్తచెదారం తీసుకొచ్చి ఫ్యాక్టరీ స్థలంలో పారవేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతం దుర్గంధంగా తయారవుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా చెత్త బండి కాలనీకి వచ్చేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన బాజ గిరన్న సొంత ఖర్చులతో కొత్త కానాయపల్లి స్టేజీ సమీపంలో అంబలికేంద్రాన్ని ఏర్పాటు చేయగా రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అంబలి కేంద్రాన్ని మూడేళ్లుగా వేసవిలో కొనసాగిస్తున్నామని, కొత్తకోట, వనపర్తి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే అంబలి కేంద్రం ఏర్పాటు చేయడంతో వాహనదారులు దాహార్తిని తీర్చుకునేందుకు వస్తుంటారని బాజగిరన్న తెలిపారు. వేసవిలో అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, బాజ గిరన్నను రావుల చంద్రశేఖర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. వేసవి కాలం పూర్తయ్యేంత వరకు అంబలికేంద్రం నడుపుతానని ఆయన తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



పెబ్బేరు రూరల్: మండలంలోని పెంచికలపాడులో పీపీఎల్– 7 క్రికెట్ పోటీలను ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలను స్నేహ పూర్వకంగా ఆడాలని, గెలుపు ఓటములకు సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజవర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు యాదవ్, సహదేవుడు, సాయిరెడ్డి, కృపాకర్ రెడ్డి, హరిబాబు, మహేష్‌రెడ్డి, పాతపల్లి శేఖర్, విజయవర్ధన్‌గౌడ్, ఎన్ శేఖర్, తిరుపతయ్య, జగదీశ్వర్, విజయవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.


ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు



అమరచింత: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, పనుల్లో వేగం పెంచేలా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగంపేటలో బుధవారం జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని సాగునీటి కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారంతో పాటు ముళ్లపొదలను తొలగించే పనులు జరుగుతున్నాయని, వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో చెరువు పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలను కల్పించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మౌనిక పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో ఇఫ్తార్

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జామీయా మసీదులో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ కోఆర్డినేటర్ ఆదిత్యారెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులతో ముచ్చటించారు. అందరూ సోదరభావంతో మెలగాలని చెప్పారు.



‘భగీరథ’ నీటి సరఫరాలో అంతరాయం

- అస్తవ్యస్త పైపులైన్లతో ఇబ్బందులు
- చాలా గ్రామాల్లో ట్యాంకులకు చేరని నీరు
- లీకేజీలతో నీటి వృథా
- ముందస్తు చర్యలకు రూ.1.04 కోట్లు మంజూరు



బుసిరెడ్డిపల్లిలో వ్యవసాయ బోరు నుంచి బైక్‌పై నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తుడు

పాన్‌గల్: ఒకవైపు మండు టెండలు.. మరోవైపు అడుగంటిన భూగర్భ జలాలు.. వెరసి గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోరుల వద్ద, చేతిపంపుల వద్ద తాగునీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం మూలంగా మిషన్ భగీరథ పైపులైన్లు ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయకపోవడం, మరి కొన్ని గ్రామాల్లో పాత పైపులైన్లకే భగీరథ కనెక్షన్లు ఇవ్వడం, భగీరథ నీటి ట్యాంకులకు నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. మరోపక్క చాలా ప్రాంతాల్లో పైపులైన్ల లీకేజీలతో నీరు వృథా అవుతూ ఎత్తు ప్రాంతం, చివరి కాలనీలకు నీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

పీహెచ్‌సీకి అందని భగీరథ నీరు

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ భగీరథ నీరు అందక ఆస్పత్రి సిబ్బందితో పాటు రోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు తహసీల్దార్ కార్యాలయం, ఏఓ కార్యాలయాలకు భగీరథ నీరు అందని పరిస్థితి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పై పులైన్లు ఏర్పాటు చేసి భగీరథ నీరు సరఫరా చేయాలని ఆయా కార్యాలయాల సిబ్బంది కోరుతున్నారు.

మండల పరిస్థితి

మండలంలోని 28 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో సగానికి పైగా జీపీల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ముఖ్యంగా పాన్‌గల్, కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి, తెల్లరాళ్లపల్లితండా, అన్నారంతండా, మంగ్లపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, మాధరావుపల్లి తదితర గ్రామాల్లో నీటి ఇబ్బంది తీవ్రంగా ఉందని అధికారులు చెబుతున్నారు. తెల్లరాళ్లపల్లితండాలో భగీరథ ట్యాంకుకు నీటి సరఫరా నిలిచిపోయింది. మంగ్లపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు సక్రమంగా నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని ఆయా గ్రామాల వాపోతున్నారు.



తెల్లరాళ్లపల్లితండాలో వృథాగా మిషన్ భగీరథ ట్యాంకు

పాన్‌గల్ మండల జనాభా 48,140		
కుటుంబాలు 12,376	బోరుబావులు 61	పని చేసేవి 40
భూగర్భ జలాలు అడుగంటినవి 20	ప్రతిరోజు కావాల్సిన నీరు 51.19 లక్షల లీటర్లు	
అందుతున్న నీరు 48.69 లక్షల లీటర్లు	కొరత 2.5 లక్షల లీటర్లు	
చెరువులు 89	వాటర్ ట్యాంకులు 65	నల్లాలు 11,843
చేతి పంపులు 36	పనిచేయనివి 26	
సింగిల్ ఫేజ్ మోటార్లు 43	పనిచేస్తున్నవి 34	

తాగునీటికి తప్పని ఇబ్బందులు



బుసిరెడ్డిపల్లి శివాలయం వీధిలో భగీరథ నీరు మూడు, నాలుగు రోజులకు ఒకసారి వస్తున్నాయి. అది కూడా కొద్దిసేపే వస్తుండటంతో నీరు ఏమాత్రం సరిపోవడంలేదు. వ్యవసాయ బోర్లు, చేతిపంపుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు.

– కొమారి రాములు, బుసిరెడ్డిపల్లి

వినియోగంలోకి తీసుకురావాలి



మా తండాలో నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో భగీరథ ట్యాంకు నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడంలేదు.

– శాంతమ్మ, మాజీ సర్పంచ్, తెల్లరాళ్లపల్లితండా

ముందస్తు చర్యలు తీసుకుంటాం



మండలంలో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించాం. దీంతో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యల నిమిత్తం రూ.1.04 కోట్ల నిధులతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కాలిపోయిన మోటార్లు, లీకేజీల మరమ్మతులు, ప్రత్యేక పైపులైన్ల ఏర్పాటు ద్వారా నీటి ఎద్దడి నివారణకు తగు చర్యలు తీసుకుంటాం.

– కోటేశ్వర్, ఎంపీడీఓ, పాన్‌గల్

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

చిన్నంబావి: మండలంలోని చిన్నమారు గ్రామానికి చెందిన కర్ణ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను మిత్రులు నాగరాజు, ఇస్మాయిల్, తిరుమల్‌రెడ్డి తదితర స్నేహితులు పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేలను ఆర్థికసాయం అందించారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న స్నేహితుడిని కోల్పోవడం చాలా బాధకరమని, చిన్న వయస్సులోనే తమ నుంచి దూరం అవుతారని అనుకోలేదని తోటి స్నేహితులు వాపోయారు. కర్ణ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని, వారికి ఏ అవసరం ఉన్న మిత్ర బృందం అండగా ఉంటుందన్నారు.

పన్ను చెల్లిస్తే ఐదుశాతం రాయితీ

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, నీటి, దుకాణాల పన్నుల్లో ఐదు వాతం రాయితీ కల్పిస్తున్నామని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తైబజారు రుసుమును కాంట్రాక్టర్‌కు కాకుండా మున్సిపల్ సిబ్బందికే చెల్లించాలని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. మార్చి 31 నాటికే తైబజారు వసూళ్లకు సంబంధించి టెండర్ ముగిసిందన్నారు. వ్యాపారుల నుంచి తైబజారు రుసుం వసూలు చేసేందుకు సిబ్బందిని కేటాయించామని వారికే తైబజారు రుసుమును చెల్లించాలని కోరారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి



బాలకిష్టాపూర్‌లో మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొత్తకోట రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం పోలీసులు గ్రామాల్లోని బెల్ట్ షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు. మండలంలోని విలియంకొండలో బొల్లి ఆంజనేయులు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు బుధవారం రాత్రి కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. తనిఖీల్లో రూ.8,700 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, అనుమతి లేకుండా మద్యం, డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అదేవిధంగా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మద్యం సీజ్

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని బుధవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బాలకిష్టాపూర్‌కు చెందిన బోయ కృష్ణయ్య హోటల్‌లో మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించగా.. రూ.రెండు వేలు విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కృష్ణయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి పరిష్కరిస్తాం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి



పెబ్బేరులో..

పెబ్బేరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సమస్యలపై మండల ప్రత్యేక అధికారి, అదనపు డీఆర్‌డీఓ నాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాల వారీగా తాగునీటి సమస్యలను పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్‌డీఓ నాగేంద్ర మాట్లాడుతూ తాగునీటి సరఫరా తక్కువగా ఉన్న గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు తాగు నీరు అందించాడానికి అవసరం ఉన్న చోట వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకొని రైతులకు డబ్బులు చెల్లించాలని సూచించారు. ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీఓ రోజా, ఆర్‌డబ్ల్యూసీ దేవన్న, పీఆర్‌ఏఈ రమేష్ నాయుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ సుజాత, ఏఓ వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రుక్మేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ట్యాంకర్ల ద్వార నీటి సరఫరా చేపట్టే విధంగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.



ఎండల నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూర్: ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగులకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వేసవి తాపం తీర్చుకునేందుకు బావులకు, చెరువులకు, కాల్వలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలను వాటి పరిసరాల్లోకి రానివొద్దని సూచించారు. స్నేహితులతో దూర ప్రయాణాలు చేయవద్దని, సెల్‌ఫోన్లు, బైకులు ఇవ్వరాదని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్తే గొడుగు, వాటర్‌బాటిల్ తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు బీచుపల్లి, రోషయ్య, హెడ్‌కానిస్టేబుల్ బాలీశ్వర్‌రెడ్డి, జవాన్లు భీమన్న, బాలరాజు, రాణిఉన్నారు.

పాన్‌గల్: ఎండల తీవ్రత పెరుగుతున్నందున తగిన జాగ్రత్తలు పాటిస్తూ వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.వంశీ అన్నారు. బుధవారం మండలంలోని అన్నారంతండా సమీపంలోని ఇటుక బట్టీల కార్మికులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



ఆత్మకూర్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పీహెచ్‌సీ సందర్శన

మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ సందర్శించి పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పీహెచ్‌సీతో పాటు గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతూ వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డా.జోషి, బాసీత్ పాల్గొన్నారు.



అన్నారంతండాలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డా.వంశీ

బాలల రక్షణకు కృషి చేయాలి



గోపాల్‌పేట: పిల్లలకు అందరూ రక్షణగా ఉండడంతో పాటు హక్కులను కాపాడుతూ వారు ఉన్నతస్థానాలకు చేరుకునేందుకు సహకరించాలని చైల్డ్‌లైన్ కేస్‌వర్కర్ రాజు అన్నారు. బుధవారం మండలంలోని చెన్నూరులో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు వారు అందరూ బాలలే అని, వారికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. బాలల న్యాయచట్టం 2015 ప్రకారం పిల్లలను అక్రమంగా పెంచుకోవడం నేరమని, అందుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని చెప్పారు. బాల్య వివాహాల నిషేధచట్టం, ప్రేమ పేరుతో వేధిస్తే పోక్సో చట్టం, ఇలా పలు చట్టాలు ఉన్నాయని, పిల్లలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు గానీ లేదా చైల్డ్‌లైన్ వారికి గాని ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్ర మంలో ఐసీడీఎస్ సోషల్ వర్కర్ లక్ష్మమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై చర్యలు తీసుకోండి

అమరచింత: స్థానిక మున్సిపాలిటీలో జరిగిన అవినీతిలో భాగస్వాములు అయిన మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ మున్సిపాలిటీకి 13, 14, 15 ఆర్థిక సంవత్సరం ద్వారా వచ్చిన నిధులతో పాటు టీయూఐఎఫ్‌డీసీ ఎఫ్ఎఫ్‌సీ ఫైనాన్స్‌ల ద్వారా రూ.18 కోట్ల మంజూరయ్యాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అడ్డగోలుగా నిధులు ఖర్చు చేయగా.. మున్సిపాలిటీలో రూ.9 కోట్ల మేరకు అవినీతి జరిగిందని ఆరోపించారు. అవినీతి పాలకపక్షం వద్దంటూ కౌన్సిలర్లు ఏప్రిల్ 4న అవిశ్వాసంపై ఓటింగ్ ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఆరుగురు కౌన్సిలర్లు వ్యతిరేకంగా ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. అవినీతి పనులపై, నిధుల ఖర్చులపై సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. అనతరం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, నాయకులు కుతుబ్, శ్యాంసుందర్, రవీందర్, మల్లేష్, లక్ష్మీనారాయణ, నిస్సార్, ఇబ్రాయిల్, సొలు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామి పడిపూజలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కమ్మరిగేరి శివాలయం అయ్యప్ప స్వామి సన్నిధానంలో పడిపూజ కార్యక్రమాన్ని భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది అయ్యప్ప స్వామి మాలలు వేసే భక్తులు ఉదయం నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన మెట్లను కుంకుమ, గంధం, పూలు, పండ్లు తదితర వాటితో అలంకరించి పైన స్వామి వారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి నుంచి ప్రతి నెల మొదటి బుధవారం రోజు స్వామివారి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భక్తులు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాలతో సన్మానించారు.

మహనీయుల పోరాటాలు మరువలేనివి

వనపర్తి టౌన్: ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేసిన పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు, ప్రపంచ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన దొడ్డి కొమురయ్య వీరత్వ పోరాటాలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. బుధవారం శివాజీ వర్ధంతి, దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఉన్న శివాజీ విగ్రహానికి, కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17ఏళ్ల వయస్సులోనే యుద్ధం చేసి మరాఠా సామ్రాజ్యాన్ని సొంతం చేసుకున్న శివాజీ ప్రజల బాగోగుల కోసం కృషి చేసేవాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, తెలంగాణ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్ననాయుడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు తగవుల వెంకటస్వామి, నాయకులు బాలేమియా, ఇటిక్యాల బండలయ్య, చంద్రశేఖర్ నాయక్ పరమేశ్వరచారి, సత్యం చారి, నాగరాజు చారి తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోపి తదితరులు

ఖిల్లాఘనపురం: ఛత్రపతి శివాజీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ 390 పైగా యుద్ధాలు చేసి ఓటమెరుగని యోధుడన్నారు. అంతులేని దేశభక్తి, వీరోచిత పోరాటంతో భారతదేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన మహావీరుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, శివకుమార్, కృష్ణయ్య, చెన్నయ్య, లక్ష్మయ్య, సత్యంగౌడ్, మాధవగౌడ్, మల్లగౌడ్, శరవంద తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై సమావేశాలు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు తెల్లరాళ్లపల్లి, వెంగళాయిపల్లి, కేతేపల్లి, జమ్మాపూర్, బండపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై విద్యార్థుల తల్లులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో మహిళ సంఘాల సభ్యులను భాగస్వాములను చేసేందుకు ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలు బడుల నిర్వహణలో ప్రత్యేకత కనబర్చనున్నాయని, తాగునీరు, మరమ్మతులు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, యూనిఫాం కుట్టు పని తదితర వాటి బాధ్యతలను ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. ఈ కమిటీల్లో గ్రామ సంఘం అధ్యక్షురాలు చైర్మన్‌గా, పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా, ముగ్గురు కమిటీ సభ్యులుగా ఉంటారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ నాగరాజు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లి పీఎస్‌లో మాట్లాడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు